క్లుప్తంగా

95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి



కుమారప్రియంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: మండలంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ 95శాతం మేర పూర్తయిందని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి తెలిపారు. పెదపూడి, దోమాడ గ్రామాల్లో ఎంపీడీఓ, కుమారప్రియం, గండ్రేడు, పుట్టకొండ తదితర గ్రామాల్లో ఈఓపీర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మండలంలో 18 గ్రామ పంచాయతీల్లో 10,441 పింఛన్‌లబ్ధిదారులు ఉండగా 9,918 మందికి పంపిణీ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు సుంకర వీరస్వామి, లక్ష్మి, ఉష తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలో 95శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని 10,564 మందికి పింఛన్ అందించవలసి ఉండగా 10,054 మందికి శనివారం సాయంత్రానికి అందజేసినట్లు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి లక్ష బిల్వార్చన



ప్రత్యేక అలంకరణలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

రంగంపేట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సుభద్రంపేట గ్రామంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు లక్ష బిల్వార్చనను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహా రుద్రాభిషేకం, కలశ స్థాపన, గణపతి పూజ, సుబ్రహ్మణ్యస్వామి పూజ, నాగదేవతల పూజ చేపట్టారు. ముందుగా స్వామికి అర్చన చేసే బిల్వ పత్రాలకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

విశ్వేశ్వరస్వామికి డ్రైఫ్రూట్స్‌తో అభిషేకం



స్వామికి అభిషేకించిన డ్రైఫ్రూట్స్

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామిని డ్రైఫ్రూట్స్‌తో అభిషేకించారు. కార్తిక మాసం మాస శివరాత్రి పురస్కరించుకుని ఆలయం వద్ద శివమాల ధరించిన స్వాముల ఆధ్వర్యంలో జీడిపప్పు, బాదం, యాపిల్, దానిమ్మ తదితర 18 రకాల డ్రైఫ్రూట్స్‌తో అభిషేకం నిర్వహించారు. అనంతరం వాటిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.

శ్రీనివాసుడికి పంచామృతాభిషేకం



సంపరలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

పెదపూడి: సంపర గ్రామంలో ప్రాచీన ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, తులసి పూజ, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు దీపారాధన చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు పోషకాహారం అవసరం



వడిశలేరు హైస్కూల్‌లో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్రీయ బాలారోగ్య కార్యక్రమాన్ని (ఆర్‌బీఎస్‌కే) నిర్వహించారు. రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆఫ్తాల్మిక్ అసిస్టెంట్ ఇందిర, ఎంపీహెచ్‌ఏ పి.మోషెస్, బి.చంటిబాబు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

ఇసుకాసురులు



వంగలపూడి ర్యాంపు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్



ముగ్గళ్ల ర్యాంపులో అనధికార ఇసుక తవ్వకాలు

- అక్రమార్కుల ఆగడాలు
- యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- అనుమతి లేని ర్యాంపుల్లోనూ తవ్వకాలు

సీతానగరం: ఉచిత ఇసుక విధానం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. అనుమతులు లేని ర్యాంపుల్లో సైతం బాహాటంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ఆ ఇసుకను ఇతర మండలాలకు తరలించి, అక్కడి మామిడి తోటల్లో నిల్వ చేస్తున్నారు. అనంతరం లారీలపై ఎగుమతులు చేసి జేబులు నింపుకొంటున్నారు. దీనికి స్థానిక ప్రజాప్రతినిధులు అండగా ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు బేఖాతరు

సీతానగరం మండలంలోని వంగలపూడి ర్యాంపులో ఇసుక తవ్వకాలకు అనుమతి ఉంది. అయితే అక్రమార్కులు ముగ్గళ్ల, సింగవరం ర్యాంపుల్లో ఇసుకను తవ్వేస్తున్నారు. ఈ ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలకు అసలు అనుమతి కూడా లేదు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఇసుక అవసరమైనవారు సంబంధిత గ్రామ సచివాలయాల్లో ట్రాక్టర్ నంబర్‌ను రిజిస్టర్ చేసి, ఎన్ని ట్రక్కులు అవసరమో తెలియజేసి, సర్టిఫికెట్ తీసుకోవాలి. దాన్ని వంగలపూడి ఓపెన్ సాండ్ రీచ్‌లో వీఆర్వోకు చూపి, అనంతరం ఇసుక తీసుకువెళ్లాలి. కానీ ఆ నిబంధనలు పేదలకే తప్ప.. అక్రమార్కులకు వర్తించడం లేదు. నిబంధనలకు వ్యతిరేకంగా అనుమతి లేని ర్యాంపుల్లో సైతం తవ్వకాలకు పాల్పడుతున్నారు.

జోరుగా ఎగుమతులు

ర్యాంపులలో తవ్విన ఇసుకను గ్రామాల్లో స్టాక్ పాయింట్లలో నిల్వ చేసి, లారీలపై విక్రయాలు జరుపుతున్నారు. ఇటీవల అధికారులు కొన్నిచోట్ల ఇసుకను సీజ్ చేసిన నేపథ్యంలో కొత్త ఎత్తుగడ వేశారు. సీతానగరం మండల నాయకుల ఆధ్వర్యంలో అనుమతులు లేని ర్యాంపుల నుంచి ఇసుకను ట్రాక్టర్లపై గోకవరం మండలం బొల్లెద్దులపాలెం శివారు మామిడి తోటలో స్టాక్ చేస్తున్నారు. అక్కడి నుంచి లారీలపై ఎగుమతులు జరుగుతున్నాయి. అలాగే మండల సరిహద్దులో కూడా స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకుని లారీలపై ఎగుమతి చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

ఒక్క లారీ ఇసుకకు రూ.25 వేలు వసూలు చేస్తున్నారు. ఇసుకను తవ్వడానికి, ట్రాక్టర్‌పై రవాణాకు రూ.17 వేలు ఖర్చయినా, మరో రూ.8 వేలు అక్రమార్కుల జేబుల్లోకి వెళుతున్నాయి. ముగ్గళ్లలోని జగనన్న కాలనీ, శివాలయం దగ్గర స్టాక్ పాయింట్లు నెలకొల్పి రవాణా చేస్తున్నారు. అనుమతులు లేని ర్యాంపుల నుంచి బాహాటంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నా, ట్రాక్టర్లపై తరలిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీనిపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

అడ్డుకుంటే దాడి చేశారు



ముగ్గళ్ల ర్యాంపులో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. కానీ ఇక్కడ జోరుగా తవ్వకాలు జరుపుతున్నారు. బాహాటంగానే ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. వీటి రాకపోకలతో గ్రామంలో దుమ్ము లేవకుండా రోడ్డును నీటితో తడుపుతున్నారు. గత నెల 25న మా దళితుల సొసైటీ లంక భూమిలో ఇసుక తవ్వకాలు జరుపుతుంటే అడ్డుకున్నందుకు నాపై దాడి చేసి గాయపర్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందాను.

– మట్టాడి వెంకట రమణ, లంకభూమి సొసైటీ సెక్రటరీ, ముగ్గళ్ల

ఆయిల్‌పామ్‌పై అవగాహన సదస్సు

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానశాఖ, పెద్దాపురానికి చెందిన పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పోలిన రవీంద్ర పామాయిల్ తోటలో జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో సౌమిత్రి మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను వివరించారు. పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సీనియర్ ఆఫీసర్ డీఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ సాగు విస్తీర్ణం, అధిక దిగుబడుల కోసం పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై సూచనలు, సలహాలు అందించారు. ఫీల్డ్ ఆఫీసర్ కార్తిక్ రెడ్డి మాట్లాడుతూ ఎరువులు, నీటి యాజమాన్యం, చీడపీడలను నియంత్రణకు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ఎం.నాగేశ్వరరావు, సిబ్బంది శ్రీనివాస్, వీరబాబు, రైతులు పాల్గొన్నారు.

మాకూ అనుమతి ఇవ్వండి

సీతానగరం: ముగ్గళ్ల ఇసుక ర్యాంపు నుంచి ఇసుక తవ్వకాలను అనుమతి ఇవ్వాలని పలు గ్రామాల ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు శనివారం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ముగ్గళ్ల ర్యాంపు నుంచి అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్లు ఇసుకను రవాణా చేసుకుంటున్నాయని, ఇతర గ్రామాల వారిని రానివ్వడం లేదని తెలిపారు. ఇనుగంటివారిపేట, రాజంపేట, వెదుళ్లపల్లి, రఘుదేవపురం, కూనవరం తదితర గ్రామాల ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వాలని కోరారు.

సోషల్ మీడియాలో హద్దులు దాటొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సత్య కిషోర్

సీతానగరం: సోషల్ మీడియాలో హద్దులను అతిక్రమించవద్దని, లేకుంటే పలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని కోరుకొండ సీఐ సత్య కిషోర్ హెచ్చరించారు. సోషల్ మీడియా నియమ నిబంధనలు – విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై శనివారం సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సత్య కిషోర్ మాట్లాడుతూ యువత సోషల్ మీడియాలో తమ భావోద్వేగాలను అదుపులో ఉంచుకుని ప్రవర్తించాలన్నారు. ఏ పార్టీనీ, వ్యక్తినీ, మతాన్ని, సంస్థను కించపరిచేలా పోస్టులు పెట్టరాదన్నారు. ఎస్సై రామ్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని, తల్లిదండ్రులతో పాటు ఇరుగుపొరుగు వారికి కూడా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వీవీ సుబ్బారావు, అధ్యాపకులు డాక్టర్ బీవీ నాగేశ్వరరావు, డాక్టర్ బి.మాధవ్, ఎస్‌కే మదీనా, ఎ.వాణి, మీనాక్షి, వెంకటేష్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై అదుపు తప్పిన ట్రాలీ

- రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన ఐరన్ వీల్స్
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- గైట్ కళాశాల వద్ద ఘటన



హైవే నుంచి సబ్‌వే వైపు దూసుకువచ్చిన ట్రాలీ, చెల్లాచెదురుగా పడిన ఐరన్ వీల్స్



రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

రాజానగరం: జాతీయ రహదారిపై గైట్ కళాశాల సమీపంలో ట్రాలీ అదుపు తప్పింది. దానిపై ఉన్న ఐరన్ వీల్స్ (ఇనుప చక్రాలు) రోడ్డుపై పడిపోయాయి. దీంతో వాహనాలకు రాకపోకలకు దారి లేకుండా పోయింది. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విజయవాడ నుంచి ఐరన్ వీల్స్ లోడుతో వైజాగ్ వైపు వెళ్తున్న ట్రాలీ గైట్ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద అదుపు తప్పి సబ్‌వే వైపు దూసుకుపోయింది. అలాగే యూటర్న్ తీసుకుని జాతీయ రహదారికి వచ్చి ఆగిపోయింది. ట్రాలీపై ఉన్న ఐరన్ వీల్స్ రహదారిపై, సబ్‌వేపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ఘటనలో సబ్‌వేకి వేసిన ఐరన్ మెస్ కూడా పూర్తిగా ధ్వంసమైంది. దీనితో రాజమహేంద్రవరం నుంచి రాజానగరం వైపు వచ్చే వాహనాలకు గంటల తరబడి అంతరాయం ఏర్పడింది. స్థానిక పోలీసులు, ఎన్‌హెచ్ విభాగానికి చెందిన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్ సాయంతో ఐరన్ వీల్స్‌ను ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



సీతానగరంలో ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జువాలజీ అధ్యాపకురాలు ఎ.వాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సీతానగరం – పురుషోత్తపట్నం రోడ్డుపై మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వి.సుబ్బారావు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అందరూ అవగాహన కలిగి ఉండాలని, దాని నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు.

హడావుడిగా వరి కోతలు



మునగాలలో వరిపంటను కోస్తున్న మెషీన్

మధురపూడి: ఫెంగల్ తుపాను నేపథ్యంలో కోరుకొండ మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికందే సమయంలో వచ్చిన తుపానుతో బెంబేలెత్తుతున్నారు. అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన హెచ్చరికల నేపథ్యంలో వరికోతలను ముమ్మరంగా చేశారు. దీంతో మండలంలో మెషీన్లతో వరి కోతలు జోరుగా జరుగుతున్నాయి. అయితే రైతులందరూ పంట కోతకు ఉపక్రమించడంతో వరికోత మెషీన్ల కోత ధరలను యజమానులు పెంచేశారు. గతంలో ఎకరం పొలాన్ని కోయడానికి గంటలకు రూ.2 వేల నుంచి రూ.2300 వసూలు చేసేవారు. ఇప్పుడు అదే సమయానికి రూ.2,600 నుంచి 2,800 వసూలు చేస్తున్నారు. కాగా.. ఖరీఫ్ సాగుకు అడుగడుతునా ఆటంకాలు ఎదురయ్యాయి. వాతావరణం అనుకూలించకపోవడంతో సీజన్ ఆలస్యంగా మొదలైంది. సాగునీరు పుష్కలంగా అందకపోవడంతో కోతలు ఆలస్యమయ్యాయి. అలాగే పంటను తెగుళ్లు కూడా ఆశించాయి. ప్రస్తుతం ఫెంగల్ తుపాను భయపెడుతోంది.

భగవద్గీతతో మానవాళికి మేలు



బలభద్రపురంలో ప్రవచనం చేస్తున్న ఆత్మజ్ఞాన ప్రబోధకులు వివేకానంద

బిక్కవోలు: భగవద్గీత మానవాళిని సన్మార్గంలో నడిపిస్తుందని ట్రూత్ స్పిరిట్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, ఆత్మజ్ఞాన ప్రబోధకులు వివేకనంద అన్నారు. శనివారం మండలంలోని బలభద్రపురం గ్రామంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ట్రూత్ వివేకామృతం ఆధ్యాత్మిక విజయోత్సవం వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభయ్యాయి. దీనిలో భాగంగా మొదటి రోజు విదేశాల నుంచి వచ్చిన కొంత మంది సాధకులు తమ అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా వివేకనంద మాట్లాడుతూ ప్రతిరోజు భగవద్గీత చదవడం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. ఇది అత్యంత ఉన్నతమైన మార్గదర్శి అని మానవుడిలో సమూల సంస్కరణను తీసుకొస్తుందని ప్రబోధించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి సాధకులు పాల్గొన్నారు.

ఏవో పనితీరుపై బహిరంగ విచారణ



విచారణ నిర్వహిస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు

సీతానగరం: ఇటీవల సస్పెండ్ అయిన మండల వ్యవసాయశాఖాధికారి కె.సూర్యరమేష్ పనితీరుపై శనివారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులతో జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు, కోరుకొండ ఏడీకే మల్లికార్జునరావు, ఇన్‌చార్జి ఏవో రామతులసి మాట్లాడారు. ఈ సందర్భంగా వీఏఏలు మాట్లాడుతూ ఏవో సూర్యరమేష్ ఆధ్వర్యంలో ఐదేళ్లుగా విధులు నిర్వర్తించామని, ఆయనతో ఎప్పుడూ ఎటువంటి ఇబ్బంది కలగలేదన్నారు. పైఅధికారులు సూచించిన పనులను సక్రమంగా చేసేలా సలహాలు అందించేవారన్నారు. రైతులు మాట్లాడుతూ సూర్యరమేష్ ఏ సమయంలోనైనా అందుబాటులో ఉండేవారన్నారు. సాగుకు సంబంధించిన అనేక సూచనలు ఇచ్చేవారన్నారు.

ఆర్యవైశ్యుల కార్తిక వనసమారాధన



కార్తిక వన సమారాధనలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్



సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆచరిస్తున్న ఆర్యవైశ్య దంపతులు

రాజానగరం: హిందూ ధర్మ పరిరక్షణకు ఆర్యవైశ్యులు ఎంతో కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ నియోకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. దివాన్‌చెరువులో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్తిక వన సమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 110 జంటలు సామూహికంగా శ్రీరామ సహిత సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాయి. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఉసిరి చెట్టుకు పూజలు చేసి, లక్ష్మీనారాయణుని వ్రతం కూడా ఆచరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్యవైశ్యులు భారీగా తరలివచ్చారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గ్రంధి నానబ్బులు, సభ్యులు గ్రంధి రాజ, నూకరాజు, నాగబాబు, బలభద్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉమా కొమరేశ్వరస్వామికి లక్ష పత్రి పూజ



లక్షపత్రి పూజ నిర్వహిస్తున్న అర్చకులు

సీతానగరం: ముగ్గళ్ల శివాలయంలో కొలువైన ఉమా కొమరేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక అభిషేకాలు, లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. సిరిమిల్లి సత్యనారాయణ, సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో పది మంది దంపతులు లక్షపత్రి పూజలో పాల్గొన్నారు. అర్చకులు కొడమంచిలి విజయ్ కుమార్, కొండమంచిలి వినేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

బాల్ బ్యాడ్మింటన్ బాలికల విజేతగా గుంటూరు



బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేత జట్టుకు ట్రోఫీ అందించిన వాసుదేవరావు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అండర్–17 68వ అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. పోటీల్లో బాలికల విభాగంలో విజేతగా గుంటూరు జిల్లా నిలిచింది. రన్నర్‌గా శ్రీకాకుళం, తృతీయ స్థానంలో విశాఖ జిల్లాలు నిలిచాయి. జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు విజేతలకు బహుమతులు, పతకాలు అందజేశారు.అనంతరం మాట్లాడుతూ జిల్లాలో 68వ అంతర్ జిల్లా క్రీడా పోటీల్లో నాలుగు క్రీడలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరిగిందన్నారు. క్రీడాకారులు పోటీ తత్వంలో ఉత్తమ ప్రదర్శన కనబరిచారన్నారు. అనంతరం డీఈవో వాసుదేవరావు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్ఆర్‌కెవి స్వామిని టోర్నమెంట్ ఆర్గనైజర్లు, పీడీపీఈటీ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఇవో2 పూర్ణచంద్రరావు, రాష్ట్ర అబ్జర్వర్ రజిని, పాఠశాల హెచ్‌ఎం పళ్లా వీర ప్రభాకరరావు, పీడీ మానకొండ ధనరాజ్, జిల్లా పీడీపీఈటీ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి టీవీ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రణాళికా బద్ధంగా చదివితే మంచి ఫలితాలు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న వైద్యురాలు వేణు శ్రీలక్ష్మి

రంగంపేట: విద్యార్థులు కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికా బద్ధంగా చదివితే అద్భుత ఫలితాలు సాధించవచ్చునని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి. వేణుశ్రీలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ అధ్యక్షతన నిర్వహించిన కెరీర్ గైడెన్స్ అవగాహన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. ప్రతిభ గల విద్యార్థులకు పేదరికం అడ్డుకాదన్నారు. లక్ష్యం, సాధించాలనే కసి ఉంటే ఏ రంగానికి చెందిన విజయాన్నైనా సునాయాసంగా సాధించవచ్చునన్నారు. శారీరక, మానసిక ఒత్తిడికి గురికాకుండా సమయపాలన పాటిస్తూ చదవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణ, శ్యామలరావు, శ్రీనివాస్, ప్రసాదరావు, ప్రసన్న, ఫ్లోరెన్స్, రమణ, సత్యప్రసాద్, హెల్త్ అసిస్టెంట్లు చంటిబాబు, సురేష్ పాల్గొన్నారు.

వేంకటేశుడికి ప్రత్యేక పూజలు



రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైన పద్మావతీ, అలమేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భక్తులతో పోటెత్తిన బలభద్రపురం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం కార్తికమాసం చివరి శనివారం సందర్భంగా భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి అర్చకులు పెద్దింటి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, నీరాజన మంత్ర పుష్పం, పుణ్యహవచనం తదితర పూజాధికారులు చేశారు. దూర ప్రాంతాల నుంచి భక్తులకు అన్నసమారధన ఏర్పాటు చేశారు. పందలపాక గ్రామానికి చెందిన పలువురు దాతలు అన్నసమారాధనకు సహకారం అందినట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి తెలిపారు.